

బతుకు బాట.. చేపల వేట

వర్షాలకు ప్రాజెక్టుల్లో నీటిమట్టం పెరగడంతో కిందికి వదులుతున్నారు. అలా వదిలిన నీటితో మంజీరా కాల్వ కళకళలాడుతోంది. అందులో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తున్నారు. చిన్న చిన్న పడవలు, తెప్పల్లో వెళ్లి వలలతో చేపలు పడుతున్నారు. వాటిని మార్కెట్‌లో విక్రయించి బతుకు బండిని లాగుతున్నారు. ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు వద్ద నిత్యం పదుల సంఖ్యలో మత్స్యకారులు తెప్పల్లో ఇలా చేపలు పడుతుంటారు.

–న్యూస్‌టుడే, పాపన్నపేట

మీటర్లు లేని ఇళ్లు 23 వేలు

గృహజ్యోతి పథకంలోకి తెచ్చేలా చర్యలు



జిల్లాలో ఇలా..
గృహ కనెక్షన్లు 2,07,643
గృహజ్యోతి లబ్ధిదారులు: 1,24,000
రాయితీ రూ.23 కోట్లు

న్యూస్‌టుడే–మెదక్: గృహజ్యోతి పథకం అమలుతో వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆదాయంపైనా దృష్టి పెట్టింది. విద్యుత్తు మీటర్లు లేని వారిని గుర్తించి... వారిని సైతం గృహజ్యోతి పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ విషయమై సంస్థ సీఎండీ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడుతారు. పరిశ్రమలు, మరోవైపు గృహ అవసరాలకు 24 గంటల పాటు విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 1.24 లక్షల మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇంకా పలువురికి గృహజ్యోతి అమలుకాకపోవడంతో ప్రభుత్వం ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పలువురు అర్జీలు ఇవ్వడంతో ప్రతినెలా వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది.

ఆదాయం కోల్పోతూ..

జిల్లాలో పలుచోట్ల కరెంటు తీగలకు కొండీలు వేసి అక్రమంగా విద్యుత్తు పొందుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదు. ఈ క్రమంలో అధికారులు జిల్లాలో విద్యుత్తు మీటర్లు లేని గృహాలను గుర్తించారు. గతంలో కొందరికి మీటర్లు ఉండగా... మరి కొందరికి లేవు. అలా మీటర్లు లేని ఇళ్లు 23,000 ఉన్నాయి. కానీ ఇళ్లకు మాత్రం విద్యుత్తు సరఫరా అవుతోంది. దీంతో ట్రాన్స్‌కో ఆదాయం కోల్పోతోంది. మరోవైపు మీటర్లు లేకపోవడంతో వీరు గృహజ్యోతి పథకం కిందకు రావడం లేదు. అటు ఆదాయం వచ్చేలా.. ఇటు పక్కాగా మీటర్లు పొందేలా సంస్థ చర్యలు చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,650, పట్టణ ప్రాంతాల్లో రూ.3,300 చెల్లిస్తే మీటర్లు బిగించనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

– శంకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ

జిల్లాలో మీటర్లు లేని ఇళ్లు 23 వేలు ఉన్నాయి. ఈనెల 15 వరకు సర్వే పూర్తి చేస్తాం. మీటర్ లేని వారు దరఖాస్తు చేసుకోవాలి. వారు 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగిస్తే గృహజ్యోతి పథకానికి అర్జీ పెట్టుకుంటే జీరో బిల్లు వస్తుంది.

సంస్కృతి, సంప్రదాయాల వారధి



బతుకమ్మ.. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ. అందరి బతుకును, బాగును కోరుకుంటుంది. జీవకోటి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉన్న తరుణాన కన్నతల్లిగా భావించి పూలతో పూజిస్తుంచడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. సమాజం, సాంకేతికత, ఆధునికత మేళవింపుగా దూసుకెళ్తున్న ప్రస్తుత తరుణంలో నాటి సంప్రదాయం, సంస్కృతికి నేటి తరం యువత పెద్దపీట వేస్తుండటం విశేషం. పది రోజుల పాటు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు కొనసాగుతాయి. ఊరూవాడ ఒక్కటవుతుంది. నిత్యం పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా మహిళలు ముచ్చటగా.. –న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్ అర్బన్

ఆటాపాట..



బతుకమ్మ పాటలు కోకొల్లలు. వందలాది జానపద పాటలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రత్యేకంగా ఆల్బమ్స్ రూపొందిస్తున్నారు. నాటి పాటలను ఆధునికీకరించి విడుదల చేస్తున్నారు. యువతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లయబద్ధంగా చప్పట్లతో ఆడిపాడుతున్నారు. కోలాటం, దాండియా నృత్యాలతో హోరెత్తిస్తున్నారు. వివిధ సందర్భాల్లో పాటల్లోని నూతనత్వం అందరినీ ఆకర్షిస్తున్నాయి. జానపద పాటలు విశేషాన్ని చాటుతున్నాయి.

పూలతో బతుకమ్మ..

ఘన కీర్తి కలిగిన బతుకమ్మ విశిష్టత కొనసాగుతుందనడానికి పూల బతుకమ్మనే నిదర్శనం. మెజార్టీ కుటుంబాలు పూలతో అలంకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బతుకమ్మ పేర్చే విధానాన్ని యువత ఆసక్తిగా గమనిస్తూ నేర్చుకుంటున్నారు. ఇది సంస్కృతి వైపు మళ్లించేందుకు దోహదం చేస్తోంది. పర్యావరణ స్పృహ పెరుగుతుంది.

సమష్టి తత్వం..

ఈ పండగ సమష్టి తత్వానికి ప్రతిబింబం. అప్పటివరకు ఇంటికే పరిమితమైన ఎంతో మంది మగువలు ఆరుబయట ఒకచోటికి చేరడంతో కొత్త స్నేహాలు చిగురిస్తున్నాయి. ఆప్యాయంగా మాట్లాడుకునేందుకు చక్కటి వేదిక. విద్యాసంస్థల్లో సంప్రదాయం తెలిసేలా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో యువతులు తమదైన శైలిలో ఆస్వాదిస్తున్నారు.

విశ్వవ్యాప్తం..

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ వేడుకలు విశ్వవ్యాప్తమయ్యాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలకూ వ్యాపించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చారిత్రక వైభవాన్ని చాటేలా వేడుకలు సాగుతున్నాయి. ఈ పండుగ.. సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రం, శిల్పం మేళవింపని పరిశోధకులు చెబుతుంటారు.

ప్రాశస్త్యం వివరిస్తూ..

దసరాకు 13 రోజులు సెలవులు రాగా నవతరం.. మన సంస్కృతిని తెలుసుకునేందుకు చక్కటి సమయం ఇదే. కుటుంబమంతా ఒక చోటికి చేరుతోంది. ఊర్లలో ఉండే అమ్మమ్మ, నానమ్మల ఇళ్లకు వెళ్తున్నారు. పండుగ ప్రాశస్త్యం, విశిష్టత, బతుకమ్మ పాటలను ఆలపించే తీరు, ఆడిపాడే విధానాన్ని పెద్దలు వివరిస్తున్నారు.

చెరువుల్లో నిమజ్జనం..



ప్రకృతిని గౌరవించే సంప్రదాయం మనది. పర్యావరణం, పూలు, నీళ్లు.. ఇవన్నీ మానవ సంబంధాలను బలపరుస్తాయి. బతుకమ్మను నీళ్లలో నిమజ్జనం చేయడం వల్ల పూలల్లో ఉండే ఔషధాలు జల వనరుల్లోని జీవరాశి సంరక్షణకు దోహదపడతాయి. చెరువుల వద్దకు అందరూ చేరుకొని అక్కడ ఆడిపాడి వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇది స్నేహ బంధాన్ని పెంచుతుంది.



ఆహార్యం.. అలంకరణ

మగువలు అలంకరణకు పెద్దపీట వేసే సమయమిది. అలంకరణ.. ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది. సృజనాత్మకతను ప్రతిబింబిస్తుంది. ఎంత ఆధునిక కాలమైనా.. యువతులు సంప్రదాయ వస్త్రధారణకు అత్యధికులు పెద్దపీట వేస్తున్నారు. చీర కట్టు, బొట్టులో అమ్మ, అమ్మమ్మ, నానమ్మలను అనుకరిస్తున్నారు.



ఎనలేని సంతోషం మౌనిక, మెదక్



పూల పండగ వచ్చిందంటే ఎనలేని సంతోషం, ఉత్సాహం వస్తుంది. ఏటా వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటాం. బొడ్డెమ్మ నుంచి బతుకమ్మ వరకు పూలతో అమ్మవారిని తయారు చేస్తాం. వీధిలో అమ్మాయిలంతా హుషారుగా పాల్గొంటారు.

ఆత్మీయ వేదిక బాలమణి, మెదక్



మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే పండగ బతుకమ్మ. ఇది తొమ్మిది రోజుల వేడుక. ఆడపడుచుల ఆత్మీయతకు వేదికగా నిలుస్తుంది. యువతులు సంస్కృతి, సాంప్రదాయాలు మర్చిపోవద్దు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలను ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. శనివారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు, శిక్షకులు, మేనేజర్లతో కలిపి మొత్తం 250 మంది పాల్గొంటారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేష్, పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

మెదక్ అర్బన్: రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో స్పెషల్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మండలం మాదాపూర్ గ్రామానికి సంబంధించిన సివిల్ కేసులో ఇరువర్గాల మధ్య రాజీకుదిర్చారు. న్యాయవాదులు పోచయ్య, సుభాష్ చంద్రగౌడ్, కిరణ్ రాజ్, దుర్గారెడ్డి ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

మెదక్: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. జిల్లాలో 300 పోస్టులకు గాను 1:3 నిష్పత్తిలో 732 అభ్యర్థులను ఆహ్వానించారు. ఈనెల 3 నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కాగా, శనివారం 61 మంది హాజరయ్యారు. మొత్తం 732 అభ్యర్థులకు గాను 682 అభ్యర్థులు హాజరయ్యారు. 92 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 235 మంది, 30 భాషా పండితుల పోస్టులకు 66 మంది, 156 ఎస్జీటీ పోస్టులకు 356 మంది, 21 ఎస్జీటీ ప్రత్యేక విద్య పోస్టులకు 22 మంది, ఒక పీఈటీ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు.

చంద్రఘంటా దేవిగా వనదుర్గమ్మ



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం నీలం రంగు వస్త్రాలంకరణలో చంద్రఘంటా దేవి(అన్నపూర్ణ)గా దర్శనమిచ్చింది. ఆలయం వద్ద వరద ప్రవాహం తగ్గడంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి అలంకరణ, సహస్రనామార్చన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. రాజగోపురంలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగాయి. గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించిన దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మ సన్నిధిలో న్యాయమూర్తి...

వనదుర్గామాతను మెదక్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్ చంద్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తదుపరి గోకుల్ షెడ్‌లో పూజల్లో పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్ చంద్

కళాశాలలో ఘనంగా పూల పండగ



బతుకమ్మను పూజిస్తున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే పండుగ బతుకమ్మ అని జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి బతుకమ్మను పూజించి, పాటలు పాడుతూ, ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యతిరాజవల్లి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డం వెంకటస్వామికి నివాళి



నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, న్యూస్‌టుడే: పేదల, బడుగు, బలహీన వర్గాలకు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి విలువైన సేవలు అందించారని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. సమకాలీన రాజకీయాల్లో విశిష్టమైన రాజకీయ శైలిని అవలంబించిన మహానేత గడ్డం వెంకటస్వామి అని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాజు, డీసీఆర్బీ సీఐ మధుసూదన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరేందర్ పాల్గొన్నారు.

హరిత వనాల్లో నాటిన 4 వేల మొక్కల తొలగింపు!

కౌడిపల్లి: కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామ పంచాయతీ లింగంపల్లి శివారులోని బిట్ల తండాకు సమీపంలో అటవీప్రాంతంలోని హరితవనాల్లో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. శనివారం కూలీలు మొక్కల వద్దకు వెళ్లగా అవి కనిపించకపోవడంతో అవాక్కయ్యారు. 20 రోజుల క్రితమే కానుగతో పాటు వివిధ రకాలకు చెందిన 4 వేల మొక్కలను నాటినట్లు క్షేత్రసహాయకుడు అర్జున్ తెలిపారు. విషయమై ఉపాధి హామీ ఏపీవో పుణ్యదాస్‌ను అడుగగా క్షేత్రస్థాయికి వెళ్లి మొక్కలు తొలగించిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాగి కుటుంబం.. బతుకమ్మ సంబరం

ప్రకృతి పండగ, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మెదక్ పట్టణంలోని నల్లపోచమ్మ కాలనీలో రాగి కుటుంబానికి చెందిన సుమారు 40 మంది కలిసి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు, దేవత రూపాలు, ఏడుపాయల రాజగోపురాన్ని తీర్చిదిద్దారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు.

- న్యూస్‌టుడే, మెదక్ అర్బన్,



గృహ ప్రవేశాలు ఎప్పుడు..!

పూర్తయినా పంపిణీలో తీవ్ర జాప్యం



నర్సాపూర్‌లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు

న్యూస్‌టుడే, నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో అర్హులైన పేదల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా.. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

పాడైపోతున్నా.. పట్టింపేది..

సొంతంగా స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణం అందిస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్ల సంగతి ఏంటనేది ఇంకా స్పష్టత రావడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా పేదలకు పంపిణీ చేయలేని దుస్థితి నెలకొంది. ఇళ్లు లేని నిరుపేదలు మాత్రం ఆశగా ఎదురు చూస్తున్నారు. పూర్తయిన ఇళ్లను సైతం పంపిణీ చేయకపోవడంతో పేదల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. పట్టణంలో వెల్దుర్తి వెళ్లే మార్గంలో ఏఎంసీకి ఎదురుగా నిర్మిస్తున్న 256 ఇళ్లు పూర్తయ్యాయి. కిటికీలకు అద్దాలు అమర్చడం, విద్యుదీకరణ, రంగులు వేయడం వంటి చిన్న పనులు పూర్తి చేస్తే పంపిణీ చేయవచ్చు. గుత్తేదారుకు రూ.35లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వాటిని చెల్లిస్తేనే మిగతా పనులు పూర్తిచేస్తానని గుత్తేదారు నిలిపివేశారు.

వివిధ దశల్లో నిలిచిన 248 ఇళ్లు..

నర్సాపూర్‌లో ఏఎంసీ వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న మరో 248 ఇళ్ల పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. వీటిని పూర్తి చేయడానికి జిల్లా అధికారులు ఎన్నో గడువులు విధించగా అవికాస్తా దాటిపోయాయి. గుత్తేదారుకు రూ.కోటిన్నరకు పైగా బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. బిల్లులు చెల్లిస్తేనే అతను పనులు చేస్తానని అంటున్నారని తెలిపారు.

ఐదు వేల దరఖాస్తులు

నర్సాపూర్‌లో గృహాల కోసం ఐదు వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని వార్డుల వారీగా విభజించి రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. కొంతమంది అర్హులను ఎంపిక చేశారు. ఇది జరిగి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. పూర్తయిన ఇళ్లను పేదలకు పంచాలని అన్ని పార్టీల నాయకులతో పాటు పురపాలిక సాధారణ సమావేశంలోనూ తీర్మానించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతా రెడ్డిలకు పుర అధ్యక్షుడు వినతి పత్రాలు ఇచ్చారు. పీఆర్ డీఈ రాధికాలక్ష్మీ వద్ద ప్రస్తావించగా పనులు చేసిన గుత్తేదార్లకు బిల్లులు రాకపోవడంతో చిన్నచిన్న పనులు సైతం పూర్తిచేయడం లేదు. బిల్లులు చెల్లిస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు.

వివరాల నమోదులో పొరపాట్లు జరగొద్దు



సర్వేను పరిశీలిస్తున్న సీఎంవో ప్రత్యేక అధికారి డా.సంగీత

మెదక్, న్యూస్‌టుడే: డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కుటుంబ వివరాలను సరిచూసుకోవాలని సీఎంవో ప్రత్యేక అధికారి డా.సర్వే సంగీత సత్యనారాయణ సూచించారు. మెదక్ పట్టణంలోని 20వ వార్డులో కొనసాగుతున్న సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ వరకు అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి.. కుటుంబాల సమగ్ర వివరాలను నమోదు చేయాలని సూచించారు. సర్వే కోసం క్షేత్రస్థాయిలో నోడల్, సమన్వయ అధికారులతో బృందాలను నియమించామన్నారు. సర్వే తుది దశకు చేరుకుందని.. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నమోదు వివరాలు పక్కాగా ఉన్న తర్వాతే పంపించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ జానకీరాం ఉన్నారు.

కలెక్టరేట్‌లో మొక్కలకు నీళ్లు

ఈనాడు కథనానికి స్పందన

మెదక్, న్యూస్‌టుడే: 'మంత్రి నాటితే మాకేంటి' శీర్షికతో శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి కలెక్టరేట్ వర్గాలు స్పందించాయి. ఈ మేరకు సిబ్బంది మొక్కలకు నీళ్లు పోశారు. కలెక్టరేట్ సిబ్బందితో నిత్యం మొక్కలకు నీళ్లు పోయించి కాపాడుతామని అటవీ శాఖ మెదక్ రేంజ్ అధికారి మనోజ్‌కుమార్ తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణతో జీవవైవిధ్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా అటవీ అధికారి జోజి

మెదక్, న్యూస్‌టుడే: భావితరాలకు జీవ వైవిధ్యాన్ని అందించాలంటే అడవులతో పాటు జంతువులను కాపాడాలని జిల్లా అటవీ అధికారి జోజి అన్నారు. 70వ వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా శనివారం మెదక్‌లో అటవీ శాఖ సిబ్బంది ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ.. వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పోచారం అభయారణ్యం, అర్బన్ పార్కుల వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి మనోజ్ కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి కుత్బోద్దీన్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

కక్షిదారులను కోర్టుల చుట్టూ తిప్పొద్దు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



జస్టిస్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పేదలకు సత్వర న్యాయసేవలు అందేలా చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు.. కక్షిదారులను కోర్టుల చుట్టూ తిప్పవద్దన్నారు. వారికి నష్టపరిహారం త్వరగా పంపిణీ చేసేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసి పేదలకు అండగా నిలవాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర, న్యాయమూర్తులు జయంతి, సునీత రవీంద్రారెడ్డి, కృష్ణార్జున్, లావణ్యబాలరెడ్డి, రాధా కృష్ణా చౌహాన్, రమేశ్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కోర్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల భవితకు నవోదయం

- ఉమ్మడి మెదక్ పరిధిలో వర్గల్‌లో ఏర్పాటు
- కొనసాగుతున్న ప్రవేశాల ప్రక్రియ

న్యూస్‌టుడే, వర్గల్



ఉత్తమ సదుపాయాలు.. నాణ్యమైన విద్య

వర్గల్‌లో నవోదయ ఏర్పాటు: 1987

ఏటా ప్రవేశాలు: 80 మందికి

ఆరో తరగతిలో చేరికకు దరఖాస్తు గడువు: ఈ నెల 7

ప్రశాంతమైన వాతావరణం.. విలువలతో కూడిన నాణ్యమైన విద్య.. సామాజిక అంశాలపై అవగాహన.. గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో జవహర్ నవోదయ పాఠశాలలు విద్యను అందిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో వర్గల్‌లో ఏర్పాటు చేశారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యాలయాల్లో త్వరలోనే ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగియనుంది.

12వ తరగతి వరకు..

త్రిభాషా సూత్రం ప్రాతిపదికన సీబీఎస్‌ఈ సిలబస్‌కు అనుగుణంగా ఆరు నుంచి 12వ తరగతి వరకు విద్య అందిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో రాణించిన 80 మంది బాలబాలికలకు ఏటా ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ నెల 7వ తేదీతో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగియనుంది. విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంటుంది. అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ తరగతులు కొనసాగుతాయి. విద్యార్థుల్లో జాతీయ సమైక్యతా భావం పెంపొందించేందుకు మైగ్రేషన్ విధానం అమలు చేస్తారు. ఇందులో భాగంగా 9వ తరగతి చదువుతున్న 21 మంది వర్గల్ విద్యార్థులు ఏటా హరియాణాలోని నవోదయ విద్యాలయంలో చదువు కొనసాగిస్తారు.



ఇటీవల నిర్వహించిన యూత్ పార్లమెంటరీ సమావేశం

హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ మండల కేంద్రంలో 1987 నుంచి నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకాడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా వసతి సదుపాయాలు, బోధన, బోధనేతర సిబ్బంది, వారికి క్వార్టర్లు, విశాలమైన క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. పర్యావరణ హితంగా వృక్ష సంపద, అంతర్గతంగా సీసీ రోడ్లు నిర్మించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా 400 మీటర్ల ట్రాక్‌తో స్టేడియం నిర్మించారు. ప్రధాన క్రీడలన్నింటికీ కోర్టులున్నాయి. ఎన్‌సీసీలోనూ ఇక్కడి విద్యార్థులు రాణిస్తున్నారు. విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు తదితర వసతులన్నీ ఉచితమే.

పీఎంశ్రీ పథకానికి ఎంపిక

కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకానికి వర్గల్ విద్యాలయం ఎంపికైంది. దీంతో విద్యాలయం పేరు పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంగా మారనుంది. దేశవ్యాప్తంగా 14,500 విద్యాలయాలను ఎంపిక చేయనుండగా నవోదయం వర్గల్‌కు ఆ అవకాశం దక్కింది. ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. 9, 11 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 30వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తు చేయవచ్చు. ఆరో తరగతిలో చేరేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

వెలవెలబోతున్న విపణులు

- తగ్గిన సంప్రదాయ పంటల దిగుబడులు

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆహార, పప్పు ధాన్యాలు, ఋతుధాన్యాల లాంటి సంప్రదాయ పంటల సాగులో గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేటిగా ఉండేది. ఎక్కువ మంది రైతులు పత్తి, సోయాబీన్ లాంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతుండటంతో గత మూడేళ్లుగా సంప్రదాయ పంటల సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది మరింత తగ్గింది. ఉన్న కాస్త పంటలు కోతకు వచ్చినప్పటికీ వరుసగా కురుస్తున్న వర్షాలతో.. ఆ పంటలు దెబ్బతిన్నాయి. ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఏటా వినాయక చవితి నుంచి దసరా, దీపావళి వరకు ఆయా పంటల కోతలు, దిగుబడులతో గ్రామాల్లో సందడి ఉండేది. ధాన్యం బస్తాలు, అమ్మకం దారులు, కొనుగోలు దారులతో విపణులు కిటకిటలాడేవి. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు.



కళతప్పిన జహీరాబాద్ మార్కెట్ యార్డు

ఆహార ఉత్పత్తుల కొరత


సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో ఎక్కువ మంది రైతులు వానాకాలం సీజన్‌లో ప్రధానంగా పెసర, మినుము, కందులు, జొన్నలు, మొక్కజొన్న తదితర సంప్రదాయ పంటలు వేస్తుంటారు. సెప్టెంబరు రెండో వారం నుంచి అక్టోబరు మొదటి వారం వరకు పెసర, మినుము పంటలు కోతలు వస్తుంటాయి. అక్టోబరు నెలాఖరు వరకు సోయాబీన్, మొక్కజొన్న ఉత్పత్తులు చేతికి వస్తుంటాయి. దాదాపు నెలన్నరగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా పంటలు తడిసి.. 90శాతం దిగుబడులు రావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క జహీరాబాద్ విపణి గతంలో రోజుకు 4 వేల నుంచి 5వేల బస్తాల దిగుబడులు వివిధ పంటలకు సంబంధించి వచ్చేవి. దీంతో కొనుగోళ్లు, తూకాలతో అర్ధరాత్రి వరకు సందడి ఉండేది. ప్రస్తుతం రోజుకు 500 బస్తాలైనా రావడం లేదంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు.

సార్వత్రిక విద్య దరఖాస్తు గడువు పెంపు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్య పది, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి.. చదువు మధ్యలో మానేసిన వారు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు మాత్రమే ఇంటర్‌లో చేరేందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- మరికొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి



ఖాసీం

తొగుట, రాయపోల్, న్యూస్‌టుడే: మరికొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి.. బంధువులు రావడంతో ఆ ఇంట సంబరాలు మొదలయ్యాయి. పెళ్లి గడియలు సమీపిస్తున్న తరుణంలో అంతలోనే ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పెళ్లి కొడుకు తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో విషాదఛాయలు అలుముకున్న సంఘటన రాయపోల్ మండలంలోని మంతూర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకుంది. తొగుట ఎస్సై రవికాంతరావు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. ఖాసీం అలీ(73) చిన్న కుమారుడు నిజాముద్దీన్ పెళ్లి శనివారం ఉదయం 10 గంటలకు జరగాలి. కార్యక్రమంలో భాగంగా మరో కుమారుడు వసియోద్దీన్ తన తండ్రి ఖాసీం అలీ, తల్లి సాహెరాతో అలీతో కలిసి గజ్వేల్ నుంచి కారులో తిరిగి వస్తున్నాడు. తెల్లవారుజామున వెంకట్రావుపేట శివారులో అడ్డుగా వచ్చిన అడవి పందిని తప్పించబోయి అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఖాసీం అక్కడికక్కడే మరణించగా అతని భార్య సాహెరా, కుమారుడు వసీయుద్దీంకు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడు యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు..



గూనయ్య

చేగుంట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో యువకుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం పొలంపల్లి వద్ద శనివారం జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. వెల్దుర్తి మండలం బండమీదిపల్లికి చెందిన గంపల గూనయ్య(28) చిన్నశంకరంపేట మండలం చందంపేటలో ఉన్న ఓ పరిశ్రమలో కూలీ పనులు చేస్తుంటాడు. ఆయనకు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన యువతితో ఆరు నెలల క్రితం వివాహమైంది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు పరిశ్రమ నుంచి వచ్చి మెదక్ వెళ్లే మార్గంలో అతివేగంగా వెళ్తుండగా పొలంపల్లి దాటిన తర్వాత ద్విచక్రవాహనం అదుపు తప్పటంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తాపడటంతో..

చేగుంట, న్యూస్‌టుడే: పాత ఇనుప సామగ్రితో వెళ్తున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తాపడటంతో అందులో కూర్చున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం బల్లాలపల్లి గ్రామానికి చెందిన మంత్రియల్ల నాగయ్య(43).. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ శివరాంపల్లిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అడ్డా కూలీగా పనులు చేస్తుంటాడు. గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పాత ఇనుమ సామాను తీసుకొచ్చేందుకు చిన్నలారీలో బయలుదేరాడు. రాత్రి అక్కడి నుంచి డ్రైవర్‌తో కలిసి తిరిగి వస్తున్నారు. చేగుంట జాతీయ రహదారి బైపాస్ వంతెన వద్ద డ్రైవర్ అతివేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో లారీ బోల్తాపడింది. క్యాబిన్‌లో కూర్చున్న నాగయ్య అందులో నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని 108 వాహనంలో కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు వెళ్తుండగా..



దుర్గయ్య

గుమ్మడిదల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం గ్రామానికి చెందిన కోరబోయిన దుర్గయ్య(56) అన్నారం పరిధిలోని వాయుసేన అకాడమీలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నారు. శనివారం స్వగ్రామం నుంచి విధులకు హాజరయ్యే నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అన్నారం సమీపంలో వెనుకవైపు నుంచి వచ్చిన మరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గయ్య రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డీ గ్రామంలో చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కోడె చంద్రప్ప(55) వాళ్ల చిన్ననాన్న మరుతప్ప ఇంటి వద్దనున్న పశువులపాకలో ఆవులను కట్టేసి వస్తానని వెళ్లాడు. అక్కడ డ్రైనేజీ నిండటంతో చెత్తను తీసి వేసే క్రమంలో బసవేశ్వర గుడి దగ్గర డేకరేషన్ నిమిత్తం ఏర్పాటు చేసిన సీరియల్ లైటింగ్ తీగలు ఆయనకు తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీనిని గమనించిన ఆయన భార్య శాంతమ్మ రక్షించడానికి వెళ్లగా ఆమెకు కూడా విద్యుదాఘాతం తగలడంతో పక్కకు జరిగింది. అచేతనంగా పడిఉన్న తన భర్తను గ్రామస్థుల సాయంతో బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఖేడ్ ప్రాంతం.. గునుగు పూలకు ప్రత్యేకం





బతుకమ్మలను పేర్చడంలో గునుగు పూలదే ప్రత్యేకం. బీడు భూములు, చేల ఒడ్డున, కంది, పెసర, మినుము తదితర పంటల్లో కలుపు మొక్కల్లా పెరుగుతుంటాయి. ఖేడ్ ప్రాంతంలో సాగునీటి వనరులు తక్కువ. బీడుభూములు అధికంగా ఉంటాయి. ఈ ప్రాంతంలో గునుగుపూల మొక్కలు ఎక్కడచూసినా కనిపిస్తుంటాయి. జిల్లాతోపాటు పొరుగున ఉన్న కామారెడ్డి, మెదక్‌లకు చెందిన చాలా మంది ఇక్కడి గునుగు పూలను వాహనాల్లో తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో జిల్లాలోని జోగిపేట, మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలోని పిట్లం, నిజాంసాగర్, నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ తదితర ప్రాంతాలకు పూలను తరలిస్తున్నారు. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్

నక్కవాగులో హరిత సోయగం



హత్నూర-సంగారెడ్డి మండలాల సరిహద్దు మీదుగా ప్రవహిస్తున్న నక్కవాగు ప్రకృతి రమణీయతతో ఆకట్టుకుంటోంది. పరీవాహకంలో ఎక్కడ చూసినా హరిత సోయగాలు, వాగు పరవళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వాగు పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఆరంభమై 25 కి.మీ. ప్రవహించి హత్నూర మండలం పల్పనూరు వద్ద మంజీరా నదిలో కలుస్తుంది. –న్యూస్‌టుడే, హత్నూర

వేర్వేరు చోట్ల నలుగురి బలవన్మరణం

నాలుగు గ్రామాల్లో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ..



ఎల్లేష్

తూప్రాన్, న్యూస్‌టుడే: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. వెంకటాయపల్లికి చెందిన కిష్టారం ఎల్లేశ్(35)కు 13 ఏళ్ల క్రితం మెదక్‌కు చెందిన యాదమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్య యాదమ్మ ఏడాదిన్నర క్రితం పుట్టింటికి వెళ్లింది. పెద్దల సమక్షంలో మాట్లాడి ఆమెను తీసుకొచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. అయినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఎల్లేశ్ శుక్రవారం రామాలయం శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృత్యువాతపడ్డాడు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..



తరుణ్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మిరుదొడ్డి మండలం అందే గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పర్శురాములు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాణి, నాగరాజు దంపతుల ఏకైక కుమారుడు తరుణ్(19). డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. 20 ఏళ్ల క్రితం తండ్రి నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారాన్ని మోస్తున్న తల్లి రాణికి తరుణ్ ఆసరాగా నిలిచాడు. ఓ వైపు చదువుతూనే మరోవైపు టెంట్ హౌస్, డీజే కూలీ పనులకు వెళ్లేవాడు. అయితే గత 15 రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించినా తగ్గలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై తరుణ్ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

చికిత్స పొందుతూ మహిళ ..

జగదేవపూర్, న్యూస్‌టుడే: మండలపరిధి మునిగడపలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే బాలమణి(48) అనారోగ్యంతో బాధపడుతూ తన తల్లిగారి ఊరైన జగదేవపూర్ మండలం మునిగడపకు 4 నెలల కిందట వచ్చింది. ఆమెకు హైదరాబాదులో చికిత్స అందించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురైన బాలమణి శుక్రవారం తన తల్లికి చెందిన పొలం వద్ద గడ్డిమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గజ్వేల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



సురేష్

కొత్తూర్(కె)కోహీర్, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కొత్తూర్(కె)లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై గోపతి సతీష్ కథనం ప్రకారం... కొత్తూర్(కె)కు చెందిన సురేష్(29)కు సదాశివపేటకు చెందిన సంధ్యారాణితో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. సురేష్ జహీరాబాద్ సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో ఆరు నెలల కిందట సంధ్యారాణి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన సురేష్ శనివారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు సురేష్ సోదరుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సజీవ దహనం కేసులో ఆరుగురికి రిమాండ్



నిందితులను చూపుతున్న సీఐ వెంకట రాజా గౌడ్

రామాయంపేట, న్యూస్‌టుడే: చేతబడి అనుమానంతో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఆమె మృతికి కారణమైన ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట మండల పరిధి కాట్రియాల గ్రామానికి చెందిన పోచవ్వ హైదరాబాదులో నివాసం ఉంటూ ఇటీవల గ్రామానికి వచ్చింది. అయితే ఆమె అనారోగ్యానికి అదే గ్రామానికి ద్యాగల ముత్తవ్వ(48) కారణమని ఆరోపిస్తూ ఇంటికి వెళ్లి కట్టెలతో తీవ్రంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాయాదులైన ద్యాగల రామస్వామి, మురళి, శేఖర్, లక్ష్మి, రాజ్యలత, మహాలక్ష్మి, పోచవ్వపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఇరువర్గాలకు గతంలో భూతగాదాలు ఉన్నాయని సీఐ తెలిపారు. ఎస్సై బాలరాజు, కానిస్టేబులు శ్రీనివాస్, మౌనిక ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



సాత్విక్ శర్మ

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన చేపూరి సాత్విక్ శర్మ ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపిక పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో రాణించాడు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

‘హ్యాండ్‌బాల్’ క్రీడలో జాతీయస్థాయికి వికాస్‌గౌడ్



చేర్యాల, న్యూస్‌టుడే: మద్దూరు మండల కేంద్రానికి చెందిన వికాస్‌గౌడ్ హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడని, హైదరాబాద్‌లోని దిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నాడని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ తెలిపారు.

పశుజాతి వృద్ధి.. క్షీర సిద్ధి

- గేదెలకు కృత్రిమ గర్భధారణలో రాష్ట్రంలో ఉమ్మడి మెదక్‌కు ప్రథమ స్థానం

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జూన్ నుంచి సెప్టెంబరు వరకు..

కృత్రిమ గర్భధారణ చేసిన గేదెల సంఖ్య: 1432

ఈ లెక్కన రాష్ట్రంలో ఉమ్మడి మెదక్ స్థానం: ప్రథమ

ఆన్‌లైన్‌లో నమోదయినవి: 1004

ఈ లెక్కన ఉమ్మడి మెదక్ స్థానం: ద్వితీయ

మొత్తం గోపాలమిత్రలు: 140

రైతులు ఆర్థిక వృద్ధి సాధించేందుకు పంటల సాగుతో పాటు పాడిపరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పశుజాతి వృద్ధికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. కృత్రిమ గర్భధారణ(ఏఐ) ద్వారా పశువులకు ఎక్కువగా ఆడ దూడలే పుట్టిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గోపాలమిత్రలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ(డీఎల్‌డీఏ) గేదెలకు కృత్రిమ గర్భధారణలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

రాష్ట్ర స్థాయి గుర్తింపు

డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో జూన్ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. కృత్రిమ గర్భధారణ విధానంలో 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉంది. ఆడ దూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశుపోషకులకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటి వరకు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కలిపి మొత్తం 1432 గేదెలకు కృత్రిమ గర్భధారణ చేశారు. సాంకేతిక సమస్యల కారణంతో వీటిలో 1004 మాత్రమే అంతర్జాలంలో నమోదు చేశారు. కృత్రిమ గర్భధారణలో ఆన్‌లైన్ పరంగా ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం, ఆఫ్‌లైన్ పరంగా ప్రథమ స్థానంలో ఉంది.


మూడేళ్లకే పాల దిగుబడి

ఈ పథకంలో భాగంగా పుట్టిన ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే మరో దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.



కృత్రిమ గర్భధారణతో జన్మించిన లేగదూడ

సద్వినియోగం చేసుకోవాలి



డీఎల్‌డీఏ పథకం ద్వారా మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. ఇలాంటి వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశంతో రైతులు కేవలం రూ.250 వ్యయంతో గేదెకు కృత్రిమ గర్భధారణ చేయించవచ్చు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ రాంజీ, సీఈవో(డీఎల్‌డీఏ), ఉమ్మడి మెదక్

ఎస్జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు బహుమతులు అందుకున్న వారిలో ఉన్నారు. అండర్-14కు సంబంధించి 46 కిలోల విభాగంలో సాత్విక, 58 కిలోలకు సంబంధించి బి.అర్చన, అండర్-17 విభాగంలో 53 కిలోలకు సంబంధించి లక్ష్మీప్రియ, 61 కిలోల్లో సంతోష పోటీల్లో ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో పాల్గొననున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00



సర్వే అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో డిజిటల్ సర్వే ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సర్వే సిబ్బందిని సూచించారు. శనివారం నర్సాపూర్‌లోని తన ఛాంబర్‌లో మండలంలోని గొల్లపల్లి, నర్సాపూర్ 8వ వార్డుల సర్వే అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సర్వేలో వివరాలు అందజేయని వారు ఇంటి గొల్లపల్లి పంచాయతీ కార్యాలయం, నర్సాపూర్ 8వ వార్డు ప్రజలు పురపాలిక కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికి సైతం వస్తారన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, అంజనేయులు, ఎంపీడీవో మధులత తదితరులున్నారు.

పరిహారం పెంచాలని వినతి.. ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం పెంచాలని కోరారు. నర్సాపూర్ రైతువేదికలో శివ్వంపేట మండలం ఉసిరికపల్లి, గుండ్లపల్లి, మఠ్యాపల్లి, పోతులబోగుడ, లింగోజిగూడ గ్రామాల రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..బహిరంగ మార్కెట్లో భూముల ధరలు భారీగా పలుకుతున్నాయని, ప్రభుత్వం అందించే పరిహారం పెంచాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తపస్ మండల శాఖ అధ్యక్షుడిగా స్వామి

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: తపస్ నార్సింగి మండల శాఖ అధ్యక్షుడిగా తీగుళ్ల స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలశాఖ ఎన్నికలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగేందర్‌రావు, శివజ్యోతి, కోశాధికారిగా నరేష్‌గౌడ్, కార్యదర్శులుగా గోపాల్, స్వామి, రేఖ, రమేష్, నంద, రాజు, శ్వేత, సభ్యులుగా సంతోష్, పద్మశ్రీ, గీత, కల్యాణి, శివకృష్ణ, పుష్పలత, యాదగిరి ఎన్నికయ్యారు.

మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం

రామాయంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మూఢ నమ్మకాల నిరోధక చట్టం తీసుకువచ్చి అన్ని జిల్లాల్లో అమలు చేయాలని జనవిజ్ఞాన వేదిక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. కాట్రియాలలో మంత్రాల నెపంతో దాడి జరిగి మృతి చెందిన ముత్యవ్వ కుటుంబాన్ని పరామర్శించారు. మూఢనమ్మకాలు రూపుమాపాలంటే ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. సభ్యులు పద్మ, నవీన్, మీనా ఉన్నారు.

పీఎం కిసాన్ నిధితో రైతులకు మేలు

రేగోడ్, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధుల విడుదల సందర్భంగా శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని టి.లింగంపల్లిలో ఏఈవో సునీల్‌కుమార్ చరవాణిలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు వీక్షింపజేశారు. ఆయా గ్రామాల్లో సమ్మాన్ నిధి కింద అర్హత ఉన్న 5443 రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

దారులు అధ్వానం.. చినుకు పడితే ప్రమాదం

న్యూస్‌టుడే, శివ్వంపేట:

అసలే రోడ్లు అధ్వానం..అడుగడుగునా గుంతల మయం ఆపై వర్షం వస్తే నీటితో ప్రయాణానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల దారితో రాత్రిళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు చోట్ల మట్టిరోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారి బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రజలు నానా అవస్థల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శివ్వంపేట మండలంలో గుంతల రోడ్లకు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దగొట్టిముక్కల రహదారి..

పలు చోట్ల ఇదీ పరిస్థితి

మండల కేంద్రం శివ్వంపేట నుంచి పెద్దచెరువు కట్టపై నుంచి పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. చెరువుకట్ట బీటీ రోడ్డు అడుగడుగునా గుంతలు ఉండటంతో వర్షం వస్తే నీటి గుంతలుగా ఏర్పడుతున్నాయి. చెరువు కట్టపై వీధి దీపాలు సైతం పనిచేయక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రానికి నిత్యం తాళ్లపల్లి తండా, బీకే తండా, కొత్తపేట, రత్నాపూర్, అల్లిపూర్, లింగోజిగూడ, పిల్లుట్ల పలు గిరిజన తండాల ప్రజలు శివ్వంపేటకు పెద్దచెరువు కట్టపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దశాబ్దం కిందట ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు తిరిగి మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా గుంతలు పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

- రాధిక, పీఆర్ డిప్యూటీ ఈఈ, నర్సాపూర్

శివ్వంపేట మండలంలో రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు ఇంకా రాలేదు. రాగానే పనులు చేపడతాం. శివ్వంపేట పెద్దచెరువుకట్ట బీటీ రోడ్డుకు నిధులు వచ్చాయి. పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు. త్వరలో రహదారి సమస్యలు పరిష్కరిస్తాం.

గుమ్మడిదల రోడ్డు దయనీయం

పెద్దగొట్టిముక్కుల నుంచి గుమ్మడిదల వరకు ఉన్న సుమారు 8. కి.మీ బీటీ రోడ్డు పలు చోట్ల ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి నీరు నిలిచి బురద మయంగా మారుతున్నాయి. నవాబ్‌పేట గ్రామపంచాయతీ నామాలు తండా రోడ్డు పనులు కొన్ని నెలల నుంచి నిలిపివేయడంతో అసంపూర్తిగా ఉంది. చండి గ్రామం నుంచి రూప్‌సింగ్ తండాకు మట్టిరోడ్డు వర్షం కురిస్తే బురదమయంగా మారింది. బొజ్జ తండా నుంచి బిజిలీపూర్ వరకు రోడ్డు బురదమయంగా మారుతుంది. నర్సాపూర్ తూప్రాన్ జాతీయ రహదారి, చండి గ్రామ రోడ్డు ప్రధాన ప్రాంగణం వద్ద గుంతలు ఏర్పడి మలుపు వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



శివ్వంపేట పెద్దచెరువు బీటీ రోడ్డు..

ఇరవై కోట్ల సభ్యత్వం ధ్యేయం: భాజపా



నర్సాపూర్‌లో మురళీధర్‌గౌడ్ నాయకులు

నర్సాపూర్, శివ్వంపేట: 20కోట్ల మందికి భాజపా సభ్యత్వం ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ బాధ్యులు మురళీధర్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్‌లో పార్టీ సభ్యత్వ సేకరణను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, టెలికాం బోర్డు సభ్యులు సురేష్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ తదితరులున్నారు. శివ్వంపేటలో సభ్యత్వ నమోదులో రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, మురళీధర్‌గౌడ్, మల్లేష్ గౌడ్, మండలాధ్యక్షుడు రవి, వినోద్, కొండల్‌రావు, యువ మోర్చా అధ్యక్షుడు భాస్కర్, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

రాణా ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన డీఎస్పీ

హవేలిఘనపూర్: హవేలిఘనపూర్ శివారులో రాణా నిర్మాణానికి శనివారం మెదక్ సాయుధ దళాల డీఎస్పీ రంగనాయక్ స్థలాన్ని పరిశీలించారు. రాణా నిర్మాణానికి గతంలో సర్వే నంబర్-407లో ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

చేగుంట: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యచరణ రూపొందించినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి అన్నారు. శనివారం చేగుంట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు.

ముగిసిన మంచి నీటి సహాయక శిక్షణా శిబిరం

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేటలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసిందని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. ఏఈ భిక్షపతి ఆధ్వర్యంలో శిక్షణ పొందారని, 30 మందికిగాను 29మంది హాజరు కాగా వారికి పరీక్షలు నిర్వహించారు.

నీటి సమస్య పరిష్కరించాలి

తూప్రాన్: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కారించాలని మిషన్ భగీరథ డీఈ, శిక్షణ కార్యక్రమ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ సూచించారు. తూప్రాన్‌లో కొనసాగుతున్న నీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఏఈలు దివ్య, మీనా, ఏపీవో సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రమేష్

రామాయంపేట: టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నిజాంపేట మండల పరిధి నందిగామకు చెందిన ఆకుల రమేష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సిద్ధి రాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్ ఉన్నారు.

కాకాకు ఘన నివాళి



నర్సాపూర్‌లో వెంకటస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తూ...

నర్సాపూర్, తూప్రాన్, చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: పేదల పక్షపాతి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వెంకటస్వామి (కాకా) జయంతిని శనివారం నర్సాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో మధులత, సిబ్బంది వెంకటస్వామి చిత్రపటానికి నివాళులు అర్పించారు. తూప్రాన్‌లో ఆర్డీవో జయచంద్రారెడ్డి, చిలప్‌చెడ్‌లో ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, ఈసీ భగవాన్‌రెడ్డి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టండి

కొల్చారం: ఉపాధి హామీలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఈజీఎస్ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంవత్సరంలో చేయాల్సిన పనుల పురోగతిపై గ్రామాల వారీగా సమీక్ష చేశారు. ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

కౌడిపల్లి: నిషేధిత పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి హెచ్చరించారు. శనివారం కౌడిపల్లిలోని మనగ్రోమోర్, భాగ్యలక్ష్మీ, రైతు సేవా కేంద్రాలను ఏవో స్వప్నయాదవ్‌తో కలిసి తనిఖీ చేశారు. దుకాణాలకు వచ్చిన రైతులకు సూచనలను అందించాలన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబురం



మెదక్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



నర్సాపూర్‌లోని ఓ ఫార్మసీ కళాశాలలో ...

ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే వేడుక బతుకమ్మ పండుగ. శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలోతో పాటు పట్టణ, గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెదక్, రామాయంపేటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడి గ్రామ వీధులకుండా ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. తూప్రాన్, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, పాపన్నపేట, వెల్దుర్తి, కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడక నిర్వహించారు. చేగుంట, నార్సింగి, మాసాయిపేట, చిలప్‌చెడ్, శివ్వంపేట మండలాల్లోనూ వేడుకలు జరిపారు. - న్యూస్‌టుడే బృందం



పాపన్నపేట జూనియర్ కళాశాలలో ...



తూప్రాన్ ప్రభుత్వ కళాశాలలో ...

గుండెపోటుతో దినసరి కూలీ మృతి

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన వ్యక్తి నిద్రలోనే గుండెపోటుతో ప్రాణాలు వదిలిన సంఘటన మండల పరిధి ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సారంగడ్ జిల్లా కోసిర్ గ్రామానికి చెందిన సురేశ్ కుమార్ బర్మన్(46) పది రోజుల క్రితం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ఓ పరిశ్రమ నిర్మాణ పనులు చేయడానికి తన అక్క సంతోషి వద్దకు వచ్చాడు. అతిగా మద్యం తాగి వచ్చి పనులు చేసే చోట ఆరుబయట నిద్రించాడు. గుండెపోటు వచ్చి నిద్రలోనే మృతి చెందాడు. మృతుడి అక్క సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి...

మనోహరాబాద్, న్యూస్‌టుడే: భిక్షాటన చేసుకునే వ్యక్తి రహదారి పక్కన గాయాలతో పడి ఉండటంతో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారు జాతీయ రహదారి పక్కన ఈనెల 2వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. అతనిని పంచాయతీ సిబ్బంది తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కాళ్లకల్ పంచాయతీ బిల్ కలెక్టర్ ప్రత్యూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని నక్క..

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి సమీపంలో శనివారం ఉదయం నక్క రోడ్డు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. నక్క అక్కడే పడిపోవడంతో గ్రామస్థులు, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు నర్సాపూర్ పశుసంవర్ధకశాఖ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు ఏడీ జనార్దన్‌రావు తెలిపారు. కలేబరాన్ని అటవీశాఖ అధికారులు పాతిపెడతారని ఆ శాఖ ఉపరేంజ్ అధికారి సిద్దిరాంసింగ్ తెలిపారు.

వివాహితకు వేధింపులు.. ఇద్దరిపై కేసు

పాపన్నపేట: ఓ వివాహితను వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తి, అతని సోదరుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం. .మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత(36)ను అర్కెల గ్రామానికి చెందిన శేషశయనారెడ్డి, అతని సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా తరచూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో విషయాన్ని కుటుంబీకులకు తెలిపింది. వారి సాయంతో స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

కోతుల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దగొట్టిముక్కలో బాలుడిపై కోతుల మంద దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బాలుడు మధుకర్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా కోతుల గుంపు ఒక్కసారిగా బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యానికి సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి...

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం రాత్రి కౌడిపల్లి జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ మండలం పాతూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజు ద్విచక్రవాహనంపై మెదక్ వైపు వెళుతున్నాడు. మెదక్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాజు కిందపడి కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా వెంటనే 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని స్థానిక హెడ్‌కానిస్టేబుల్ ఎలియాస్‌రెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కోలపల్లి గ్రామ శివారు జాతీయ రహదారిపై పాత టోల్‌ప్లాజా వద్ద శనివారం ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకి చెందిన బస్సు నారాయణఖేడ్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద ఓ కారు ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. దీంతో ఫుట్ రెస్ట్ విరిగిపడింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ప్రయాణికులను వేరే బస్సులో పంపారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై శంకర్ దర్యాప్తు చేపట్టారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనం..



మెదక్‌లో..



నర్సాపూర్‌లో శాకాంబరిగా...



నార్సింగిలో గాజులతో అలంకరణ



రామాయంపేటలో..



మన్నెవారిజలాల్‌పూర్‌లో పూజలు

దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆలయాలు, పట్టణ, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. పలుచోట్ల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. మెదక్, చిన్నశంకరంపేట,నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, టేక్మాల్ వెల్దుర్తి ఉమ్మడి, శివ్వంపేట చేగుంట, నార్సింగి, చిలప్‌చెడ్ మండల్లాలో మండపాల వద్ద భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే బృందం

దుకాణానికి కన్నం రూ.40వేల మద్యం, నగదు చోరీ

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయాన్ని ఆనుకుని జాతీయ రహదారిపై ఉన్న బృందావన్ వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. దుకాణం వెనక భాగం గోడకు కన్నం వేసిన దొంగలు లోపలికి ప్రవేశించి రూ.40వేల విలువైన మద్యం సీసాలను, నగదు అపహరించారు. సీసీ కెమెరాలను ఆపేసి, హార్డ్‌డిస్క్ చోరీ చేశారు. శనివారం ఉదయం దుకాణం తెరవగా చోరీ జరిగినట్లు గుర్తించారు. యజమాని ఫిర్యాదుతో శనివారం నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప స్వాధీనం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పెద్దశంకరంపేట అటవీరేంజ్ పరిధి టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్‌ని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ తెలిపారు. పట్టా భూముల్లో అక్రమంగా నరికిని చింత, తుమ్మ, వేప చెట్ల మొద్దులను కుసంగి నుంచి ఇతర గ్రామాలకు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ట్రాక్టర్‌ని పట్టుకుని, యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

సేవలు సక్రమంగా అందించాలని నిరసన



బ్యాంకులో కిక్కిరిసిన ఖాతాదారులు

అల్లాదుర్గం న్యూస్‌టుడే: మండలంలోని గడిపెద్దాపూర్ సెంట్రల్ బ్యాంకులో సేవలు సక్రమంగా అందించాలని ఖాతాదారులు, ఫించన్‌దారులు, వృద్ధులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా సిగ్నల్ అందడం లేదని బ్యాంకు అధికారులు సేవలు నిలిపి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాతాదారులును అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దసరా, బతుకమ్మ పండగలకు డబ్బులు అవసరం ఉందని బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోందన్నారు.

ఎల్వోసీ అందజేత

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని ఎలుకపల్లికి చెందిన జగన్ కుమార్తె వర్షిణి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిరుపేదలైన వారు ఆస్పత్రి బిల్లులు చెల్లించలేని స్థితి. ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. సీఎం సహాయనిధి నుంచి రూ.75వేల ఎల్వోసీ పత్రాన్ని ఆయన మంజూరు చేయించగా శనివారం వర్షిణి తండ్రికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు.